


చలి గాలికి నరాలు జివ్వుమంటున్నయ్. ఉదయం ఆరున్నర కావొస్తున్నా, మంచుతెర పడలేదు. పదిగజాల దూరాన వున్న వాళ్ళు కూడా స్పష్టంగా అగుపించడం లేదంటే, ఆశ్చర్యం కాదు.

కిళ్ళీకొట్టుముందు నుంచొని, సిగరెట్ వెలిగిస్తున్నాడు నారాయణ. స్టేషన్ ప్లాట్ ఫాంమీద ప్రయాణీకుల హడావిడి స్పష్టంగా వినిపిస్తోంది. మద్రాసుపోయే మెయిల్ వచ్చేవేళయింది. రోడ్డుకేసి దీక్షగా చూస్తున్నాడు నారాయణ. దూరంలో రిక్షా వస్తున్నదీ, లేనిదీ అగుపించడంలేదు. కాలం దొర్లిపోతూ వుంటే, అతనిలో విసుగు చోటుచేసుకుంటోంది. అతని మెదడులో యెన్నో ఆలోచనలు... ఇంతకీ రా

ద

# ముద్దంశెట్టి హనుమంతరావు

వస్తుందా? వస్తానని మాటిచ్చి, తనని దద్దమ్మని చేసిందేమో? మంచిగా తనని మోసగించిందేమో! ... ఈ సందేహాలు అతనిలో మెదిలేసరికి ఒక్కసారిగా అతని వొళ్లు వేడెక్కింది. సిగరెట్ దమ్ము గట్టిగా ఓసారి లాగి, తీక్షణంగా రోడ్డు కేసి చూశాడు. ఏదో రిక్షా దగ్గరపడుతుండటం చూసి, ఆశతో, ఆసక్తితో రెండడుగులు ముందుకేశాడు. ఆ రిక్షాలో బొర్రమీసాలాయన అగుపించేసరికి నీరుగారిపోయి, నీరసంగా ఓ నిట్టూర్పు వదిలాడు నారాయణ.

మద్రాసు మెయిలు 'బఁయ్'మని కూత కూసుకుంటూ రానేవచ్చింది. ఇప్పుడేం చెయ్యడమో నారాయణకి పాలుపోవడం లేదు. తన ఆశలన్నీ నిరాశలైనందుకు, తను మోసపోయినందుకు అతనిలో నిప్పురవ్వలు ప్రజ్వరిల్లినై. కోపాన్ని అరికట్టుకోలేక, మరేం చెయ్యాలో బోధపడక, కాలుస్తున్న సిగరెట్ని కసిగా, విసురుగా నేలకేసి కొట్టాడు.

కిళ్లీ కొట్టాయన నారాయణకేసి వింతగా చూశాడు.

"బండి వచ్చేసింది బాబూ! ఇంకా యిక్కడే నిల్చున్నారేటి?" అన్నాడు కిళ్లీకొట్టువాడు. ఆ ప్రశ్న వెయ్యడంతో అగ్ని మీద ఆజ్యం పోసినట్టయ్యింది నారాయణకి. అయినా, అంతకోపాన్నీ బాహ్యంగా వ్యక్తం చేసుకోవడం యిష్టం లేకపోయింది.

"మా స్నేహితుడికోసం యెదురు చూస్తున్నానోయ్....అతడు రానిదే నేను వెళ్ళలేను." మనసులో వుప్పెనలా పొంగే కోపాన్ని దిగమ్రింగుకోడానికి ప్రయత్నిస్తూ, ముక్తసరిగ అన్నాడు.

మద్రాసు మెయిలు, కూతకూస్తూ కదిలింది.

నారాయణ, కసిగా వెళ్ళిపోతున్న రైలు కేసి చూశాడు. అతని కళ్ళల్లో యెర్రని చారలు ఏర్పడినయ్. మరో సిగరెట్ వెలిగించి, రిక్షాని పిలిచాడు, సూట్కేసు విసురుగా రిక్షాలో పడేసి, తనూ కూచున్నాడు.

"వూళ్లోకి పోవోయ్...." అన్నాడు.

"ఎక్కడికి బాబూ!" రిక్షావాడి ప్రశ్న.

"తిన్నగా పోనీయ్....నే చెప్తాగా!" విసుక్కున్నాడు.

రిక్షా కదిలింది. నారాయణ మెదడు నిండా ఆలోచనలే. ఆ ఆలోచనల్లో, తను జారవిడుచుకున్న అదృష్టం, ప్రతీకార వాంఛ, అన్నీ వున్నయ్.

వెళ్లి పోతున్న రిక్షాకేసి చూస్తూ, కిళ్ళీ కొట్టువాడు నవ్వుకున్నాడు.

*   *   *

ఆ రోజు సాయంత్రం, నారాయణ కాస్త పెందరాళే పార్కుకి వెళ్ళాడు. రాధని నిలదీసి అడగాలన్న వుద్దేశంతోనే వెళ్లాడు. ఆమె వస్తుందని, చాలా సేపు నిరీక్షించాడు. కాని, ఆమె రాలేదు. రోజూ అదే పార్కులో కలుసుకునే వాళ్లు వాళ్లిద్దరూను. ఆ రోజు యెందుకామె రాలేదో నారాయణకి అర్థం కాలేదు. ఆమె, కావాలని తనని వెర్రివెంగళప్పని చేసి మోసగించిందో, లేక పరిస్థితులు ఎదురు తిరగడం వల్ల రాలేక పోయిందో, అతనూహించలేక పోతున్నాడు. అయితే వివరాలు తెలుసుకోవడం యెట్లా? ఆలోచించిన మీదట ఒక్కటే మార్గం అగుపించింది. ఆమె ఇంటికేసి వెళ్ళాలనుకున్నాడు. అటుకేసి నడిచాడు అయితేనేం, ఇంటి బైట ఆమె జాడే అగుపించలేదు. ఇంట్లోపలికి వెళ్ళడానికి గుండె ధైర్యం చాల్లేదు.

మరుసటిరోజు పార్కుకి వెళ్లాడు నారాయణ. రాధ అగుపించలేదు. అతనిలో విసుగు పెరుగుతోంది. మూడో రోజు, వాళ్ల చిన్న తమ్ముణ్ణి తీసుకుని రాధ వచ్చింది పార్కుకి. ఆమెను చూడగానే నారాయణ మనస్సు ఓ ప్రక్క ఉత్సాహంతో ఉప్పొంగిపోయినా, మరో ప్రక్క తనకి జరిగిన అవమానాన్ని తల్చుకొని కుమిలిపోయింది. ఏమైనా ఆమె రాకపోవడానికి కారణం ఏవిటో తెలుసుకోవాలన్న తహతహ అతనిలో పురకలు వేసే సరికి హుషారుగా అడుగులువేసి ఆమెని కలుసుకున్నాడు.

"హల్లో రాధా!" అన్నాడు మామూలు ధోరణిలో.

"హలో " అంది ముక్తసరిగ మందహాసాన్ని అందిస్తూ. ఆమె ముఖంలో ఏ విధమైన తొట్రుబాటుగాని, భయంగాని ద్యోతకం కాలేదు.

"రాముః నువ్వెళ్ళి కాస్సేపు ఆ పిల్లలతో ఆడుకునిరా!" అంటూ తమ్ముణ్ణి, అక్కణ్ణించి పంపివేసింది.


రాము, మరేం ప్రశ్నలు వెయ్యకుండా చల్లగా అక్కణ్ణించి జారుకున్నాడు.

"నన్నెందుకిలా మోసం చేశావు, రాధా?" ఆవేశంతో అడిగాడు నారాయణ. అతనికళ్ళల్లో ఎర్రని చారలు అస్పష్టంగా అగుపిస్తున్నయి.

రాధ ఆశ్చర్యపోలేదు, భయపడనూ లేదు. నారాయణకేసి సూటిగ చూసింది. సన్నగా మందహాసం చేసింది.

"మిమ్మల్ని నేనేం మోసగించలేదండీ నారాయణగారూ! కాని, నేను మోసపోకండా భగవంతుడే నన్ను రక్షించాడు. పతనావస్థకి దగ్గరగా పోతూ, మూర్ఖమై, నన్ను నేను కాపాడుకున్నాను" అంది మెల్లగ.

నారాయణ మొహంలో రంగులు మారాయి.




"అంటే, యేమిటి రాధా నీ అభిప్రాయం! నిన్ను నేను మోసం చేస్తాననా నీ అనుమానం?" అన్నాడు. తన కలవరపాటుని పొక్కనీయకుండా.

"మోసం చేస్తారని కాదు నా భయం. పరిస్థితుల పరిణామానికి యెప్పుడూ బలి అయ్యేది స్త్రీయేగా! ఎందుకో మరి, ఆ భయం నాలో చోటు చేసుకున్నందువల్ల, ఆరోజు సాహసించి ఇంట్లోంచి బైటపడలేకపోయాను."

నారాయణ ఆమె మాటల్ని పూర్తిగ విశ్వసించలేకపోయాడు.

"మరి, ఆ భయం మనసులో పెట్టుకొని, నాతో యెందుకు చెప్పావ్, ఆ వుదయం మెయిలుకి వెళ్ళిపోదామని" విసురుగానే అన్నాడు. ఆమె కళ్ళల్లోకి కరకుగా చూస్తూ.

రాధ బరువుగా ఓ నిట్టూర్పు విడిచింది.

"అలా నేను చెప్పడం నిజమే అయితే, ఆరోజు రాత్రి నేనో కథ చదివాను. ఆ కథలో నాలాంటి ఓ యువతి ఓ అబ్బాయితో ప్రేమలో పడి, తన వాళ్ళందర్నీ విడిచి, ఆ అబ్బాయితో లేచిపోతుంది. అయితే, ఆమె త్యాగం బూడిదలో పోసిన పన్నీరయ్యింది. ఆ అబ్బాయి ఆమెను మోసగిస్తాడు. మరో గత్యంతరం లేక, ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఆ కథ నాకు జ్ఞానోదయం కలిగించింది. నేను తప్పటడుగు వెయ్యబోతున్నానని, పతనమవ్వబోతున్నానని, ఆ క్షణంలోనే తెలుసుకోగలిగాను. అందుకే నా నిర్ణయాన్ని మార్చేసుకున్నాను" అంది నిబ్బరంగా.

నారాయణ మొహం క్రోధంతో ఎరుపెక్కింది. ఆమె చెప్పిందంతా అతను

నమ్మలేదు. కావాలనే ఆమె తనని మోస గించిందని అనుకున్నాడు. "ప్రతీ విషయం లోనూ మంచీ, చెడూ అన్నవి వుంటాయి రాధా! అన్నీ మనం పట్టించుకుంటు న్నామా! ఎవరో కల్పించి రాసిన ఏదో కధ, నీకు జ్ఞానోదయం కలిగించిందంటే, నేను నమ్మలేకండా వున్నాను. అటువంటి కథలు, యింతకుమునుపు యెన్నో చది వుంటావు. అటువంటివే కావు. ప్రేమించు కున్న యువతీ యువకులు, తమవాళ్ళకి దూరంగా యెగిరిపోయి, స్వేచ్ఛగా, సుఖంగా, సంసార జీవితాన్ని సాగించే కథలు కూడా చదివుంటావు. అటువంటి కథల్ని ఎందుకు నువ్వు ఆదర్శవంతంగా తీసుకోవు? అటువంటి కథలు నిన్ను ఉత్తేజపర్చడం లేదా? అందుకనే నీ మాటల్ని నేను నమ్మలేకపోతున్నాను" సూటిగా అన్నాడు నారాయణ.

"అంటే- మిమ్మల్ని నేను మనసారా వంచించానంటారా?" యెదురు ప్రశ్న వేసింది రాధ.


నారాయణ అప్పటికే చాలావరకు సహనాన్ని కోల్పోయాడు. తనలో రగులు తున్న అవమానాన్ని ఏదోవిధంగా చల్లా ర్చాలి అనుకున్నాడు.

"అది వేరే చెప్పనవసరంలేదు. నన్ను ప్రేమించినట్లు నీవు నటించావు. కేవలం కాలక్షేపానికి మాట్లాడకున్నట్టుగ, లేచి పోవాలన్న నిశ్చయానికి తలూపి, నన్ను వట్టి దద్దమ్మను చేసి వంచించావు. ఇంత వరకూ నీగురించి నాకో సదభిప్రాయ ముండేది, కాని, యిప్పుడిప్పుడే నీ నిజ రూపాన్ని తెలుసుకుంటున్నాను" నోటి కొచ్చినట్టు వాగాడు నారాయణ. అది అతని తప్పుకాదు. అతను జారవిడుచు కున్న అదృష్టం ప్రభావమది.

నారాయణలో పెరుగుతోన్న అసహ నానికి, రాధ నవ్వకుంది.

"అయితే, మీరు చాలా పొరబడు తున్నారు నారాయణగారూ! ఎవరి శ్రేయస్సు వాళ్ళు చూసుకోవడం అవసరం కదా! మీరు మగవాళ్లు...మీరు దేనికీ భయపడ నవసరం లేదు, ఏ విమర్శకి అయినా మీరు గురికానక్కర్లేదు. కాని, నాలాంటి అవివాహితులైన యువతుల జీవితం అరిటాకులాంటిది, అందుకే భయం. నిజం చెప్పాలంటే, మిమ్మల్ని నేను మనసారా ప్రేమిస్తున్నాను. అందుకు నిదర్శనం కావాలంటే, మిమ్మల్ని చట్టబద్ధంగా వివాహం చేసుకునేందుకు నేనెప్పుడూ సిద్ధమే. వివాహం జరిగాక, మనం వెళ్ళి పోదాం యెక్కడికైనా...." అంది ధైర్యంగా.

నారాయణ మొహం మాడిపోయింది. ఆ పరిస్థితిని యెట్లా యెదుర్కోవడమో అతనికి అర్థంకాలేదు. రాధను తను పెళ్ళి చేసుకోవడమా? ఆ ఆలోచనే అతనికి వింతగా తోచింది. ఆమె బాధ్యత స్వీక రించే తాహాతు తనకెక్కడిది? నిజానికి




ఆమె బలహీనత ఆధారంగా తీసుకుని, ప్రేమపేరిట ఆమెను వలలో వేసుకుని ఆనందించాలనుకున్నాడేగాని, మనసా, వాచా, ఆమెని భార్యగా స్వీకరించి సంసార కూపంలో కూరుకుపోవాలన్న అభిప్రాయం తనకెప్పుడూ లేదు. అయితే, యిప్పుడేం చెప్పడం? ఆమెని యెట్లా నమ్మించడం? ఆలోచనలతో కాస్సేపు సతమతమయ్యాడు.

"ఏమిటండీ ఆలోచన? జవాబు చెప్పరేం?" అంది రాధ మళ్ళీ,

కాస్తంత తడబడ్డాడు నారాయణ. "నిన్ను వివాహం చేసుకోడానికి నాకేం అభ్యంతరం లేదనుకో. అయినా అది ప్రస్తుతం అంత అవసరమా అని? ఉన్న ఊళ్లోకంటే యెక్కడికయినా పోయి, అక్కడే రిజిష్టరు మారేజ్ చేసుకోవచ్చునుగా? చదువుకున్న నువ్వుకూడా మరీ యింత ఛాందసంగా వుండడం బాగోలేదు" అన్నాడు పరిస్థితి తన అదుపులోకి తెచ్చుకోవాలని ప్రయత్నిస్తూ

నారాయణ వాదన రాధని నమ్మించలేకపోయింది.

"ఉన్న ఊళ్లో అయితే తప్పేమిటి చెప్పండి? ఆడదాన్ని నేనే సిద్ధపడుతూ వుంటే, మీకు అభ్యంతరం వుండడంలో అర్థంలేదు. అంటే నన్ను మనస్ఫూర్తిగా భార్యగా స్వీకరించే అభిప్రాయం మీకు లేదన్న విషయం వ్యక్తమవుతోంది. అంతేకదండీ?" అంది ధైర్యంగానే నారాయణ మొహంలోకి చూస్తూ.

నారాయణ షాక్ తిన్నాడు. తన నిజ స్వరూపం బైటపడిపోతుందేమోనని కలవరపడ్డాడు. "నువ్వు నన్ను అర్థంచేసుకోవడంలేదు రాధా!" మరో సమాధానం దొరక్క అలా అన్నాడు.

నారాయణ మనస్తత్వం [illegible] యిప్పుడు అవగతమయ్యింది. తీక్షణంగా అతని మొహంలోకి చూసింది.

"మిమ్మల్ని యిప్పుడిప్పుడే అర్థంచేసికుంటున్నానండీ. అనవసరంగా మనం వాదించుకోవడంవల్ల ప్రయోజనం లేదు. నా మనసు విప్పి చెప్పాను నాతో మీరు ఏకీభవిస్తే, నేనెప్పుడూ వివాహానికి సంసిద్ధురాలినే. ఆ తిరువాతనే యెక్కడికైనా వెళ్ళడం ప్రసక్తి వస్తుంది. నా అభిప్రాయంతో మీరు ఏకీభవించకపోతే మీతో పరిచయానికే స్వస్తిచెప్పాల్సి వుంటుంది ఆలోచించుకోండి" నిబ్బరంగా అంది.

నారాయణ నిర్ఘాంతపోయాడు. అనుకూలంగా ఉండే కథ, అడ్డం తిరిగినట్టనిపించింది. ఆమెను మరోవిథంగా భయపెట్టి మార్గానికి తీసుకురావడానికి, ఆమెను బ్లాక్ మెయిల్ చెయ్యడానికి ఆమె రాసిన ఉత్తరంకూడా తనదగ్గరలేదు. నిరుత్సాహపడిపోయాడు మనిషి. "మరీ మొండికెత్తిమాటాడుతున్నావు రాధా! పర్యవసానం ఆలోచించావా?" ఓ చిన్న బెదరింపులాంటిది విసిరిచూశాడు.

అమాయకురాలిలా అగుపించినా, అంత త్వరగా భయపడిపోయి కంగారుపడే మనిషికాదు రాథ.

"పర్యవసానం ఏమిటో నా కంటే ముందు మీరే ఆలోచించుకోవాలి నారాయణగారూ! మీ అర్థంలేని బెదరింపుకు [illegible] అనుకుంటే అది కేవలం భ్రమే అవుతుంది. మీరు రాసిన ఉత్తరం ఒకటి నా దగ్గర పదిలంగా వుంది, అది చాలు మిమ్మల్ని ఇరికించడానికి. ఇంక మీతో వాదన నాకు అనవసరం. మీ అసలు రూపం తెలిసిపోయింది నా అదృష్టం బావుందిగాబట్టి, నేను తొందరపడలేదు, ఇక సెలవ్ ... నాలో ఆపాటి నిబ్బరాన్ని కలిగించినందుకు ఆ భగవంతుణ్ణిమొక్కుకుంటున్నాను. నాతో కనీసం మాట్లాడటానికయినా ఇంకెప్పుడూ ప్రయత్నించకండి వస్తా" అంటూ తమ్ముణ్ణికేకేసి, విసురుగా యింటికేసి నడిచింది.

నారాయణ తెల్ల మొహం వేశాడు. ఇలా జరుగుతుందని అతనూహించలేదు, వెళ్ళిపోతున్న రాధకేసి కళ్ళప్పగించి చూస్తూ శిలావిగ్రహంలా క్షణంసేపు నిలుచుండిపోయాడు, చేజారిన అవకాశాన్ని తల్చుకుంటుంటే అతనికి ఏడుపొచ్చినంత పనయింది, అంతలోనే రాధపై కోపమూ వచ్చింది. కాని ఏం చెయ్యగలడు? భగవంతుడ్ని తిట్టుకుంటూ అక్కడ్నుంచి నిష్క్రమించాడు నారాయణ.

